సాక్షి హనుమకొండ

శుక్రవారం | 29 | నవంబర్ | 2024



ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి

ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోందని, ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో ▸



నేటి నుంచి కేయూ డిగ్రీ పరీక్షలు - 8లో ▸

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీలోని పలు కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయి

గరిష్టం/కనిష్టం $28^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నాణ్యతతో కూడిన మెనూ అందించాలి



కాజీపేట అర్బన్: బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన మెనూ అందించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ వసతి గృహాల వంట పనివారు, సహాయకులకు వృత్తి నైపుణ్యం, పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి రామ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం ఎప్పటికప్పుడు తాజాగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఆఫీసర్ ఎస్.లక్ష్మణ్, కె.శంకరయ్య పాల్గొన్నారు.

పంచారామాల బస్సు ప్రారంభం



హన్మకొండ: హనుమకొండ డిపోకు చెందిన బస్సు గురువారం రాత్రి బస్ స్టేషన్ నుంచి పంచారామాల దర్శనానికి బయల్దేరగా.. ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్, హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా వినీత



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా ఏఎస్ వినీత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమెను శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డీసీఎల్‌కు అభినందనలు తెలిపిన వారిలో కార్మికశాఖ అధికారులు జి.వినోద్‌కుమార్, ఆర్.రాజకుమారి, రజిత, బి.చాణక్య ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ఎంజీఎం: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య వైద్యాధికారులకు సూచించారు. గురువారం వడ్డేపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా యూపీహెచ్‌సీలోని ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బీపీ, షుగర్, కేన్సర్ పేషెంట్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. ఆస్పత్రిలోని ఫార్మసీలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, గడువు తేదీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి లోపల, బయట, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బుధ, శనివారం ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలని, మరింత మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని ప్రసూతి ఆస్పత్రి, ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేసి ఫాలో అప్ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాధర్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి దహనం

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు రూ.1.33 కోట్ల విలువైన సుమారు 535 కిలోల గంజాయిని గురువారం ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి పర్యవేక్షణలో కాజీపేట మండలం అమ్మవారిపేట శివారు ప్రాంతంలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీస్ పరిశ్రమలోని బ్రాయిలర్‌లో దహనం చేశారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోర్.. బేజార్!

వరుస దొంగతనాలతో జిల్లావాసుల ఆందోళన

- పోయింది కొండంత.. రికవరీ గోరంత
- సైరన్ సైలెంట్ అయ్యిందా? అనే విమర్శలు
- బంగారంపైనే దొంగల దృష్టి.. ఇటీవల జరిగిన ఘటనలే నిదర్శనం



కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది దొంగతనాలు **858**

మొత్తం చోరీ సొత్తు (రూ.కోట్లు) **23.20**

రికవరీ అయిన సొత్తు (రూ.కోట్లు) **3.75**

వరంగల్ క్రైం:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న వరుస చోరీలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. అంతర్రాష్ట్ర దొంగలు కమిషనరేట్ పరిధిలో దర్జాగా చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఈనెల 19 రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బ్యాంకు దోపిడీ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇటీవల జరిగిన ఎక్కువగా అపహరించింది బంగారు నగలనే. ఈనేపథ్యంలో చోరీలు కొండంత అయితే రికవరీ మాత్రం గోరంత అన్నట్లుగా ఉంది. ఏటేటా చోరీలు పెరుగుతుండడం, బాధితులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగడం.. స్థానిక పోలీసులు, సీసీఎస్ పోలీసులు నిరంతరం దొంగల కోసం వేట సాగించడం.. మళ్లీ కొత్తగా చోరీలు జరగడం నిత్యకృత్యమైంది. ఈనేపథ్యంలో రోజురోజుకూ పోలీసులపై ఒత్తిడి పెరుగుతోంది. గతేడాదితో పోలిస్తే ఈయేడాది చోరీల సంఖ్య బాగా పెరిగింది. ముఖ్యంగా ట్రైసిటీ పరిధిలో నిరంతరం బ్లూకోల్ట్స్' పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినప్పటికీ.. రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ చోరీలు మాత్రం ఆగకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. మరో పక్క ఆన్‌లైన్ మోసాలు పెట్రేగిపోతున్నాయి.

అప్రమత్తమయ్యేనా?

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న చోరీలతో పోలీసులు ఎందుకు అప్రమత్తం కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గస్తీ అటకెక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్ సైరన్ సైలెంట్ కావడం వల్లే దొంగలు దర్జాగా తమ పని కానిచ్చేస్తున్నట్లు కనిపిస్తోంది. చోరీలు జరిగిన తర్వాత పోలీసులు హడావిడి చేయ డం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీలు జరిగి ఏళ్లు గడుస్తున్నా.. సొత్తును రికవరీ చేసి అందించడం లేదని, పోలీసులు చోరీ కేసులను ఛేదించడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు బాధితులు బాహాటంగా విమర్శలు చేయడం గమనార్హం.



పొంతన కుదరట్లే..

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరుగుతున్న చోరీలు కొండంత అయితే.. వాటి రికవరీలు గోరంత ఉండడం విమర్శలకు తావిస్తోంది. ప్రతీ యేట చోరీ సొత్తుకు, రికవరీల సొమ్ముకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. అంతర్రాష్ట్ర దొంగలు ఇక్కడ మకాం వేసి చోరీలు చేసుకొని దర్జాగా రాష్ట్రం దాటుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి కమిషనరేట్ పరిధిలో 858 చోరీలు జరగ్గా అందులో రూ.23.20 కోట్లు చోరీ సొత్తు పోయింది. ఇప్పటి వరకు రూ.3.75 కోట్లు మాత్రమే రికవరీ జరిగింది. చోరీ సొత్తుకు, రికవరీ సొమ్ముకు భారీగా తేడా ఉండడం బాధితులను ఆందోళనకు గురి చేస్తోంది.

జనవరి నుంచి చోరీలు ఇలా...

పోలీస్ స్టేషన్	చోరీలు	చోరీ సొత్తు రూపాయల్లో	రికవరీ సొమ్ము రూపాయల్లో
మట్టెవాడ	67	1,59,72,200	93,34,200
జనగామ	66	75,43,160	29,05,500
సుబేదారి	61	1,16,91,650	62,09,577
కేయూసీ	55	78,14,962	23,59,780
మిల్స్‌కాలనీ	51	66,41,000	10,37,000
ఇంతేజార్‌గంజ్	44	33,13,800	17,71,000
హనుమకొండ	44	50,03,647	18,25,069
కాజీపేట	29	33,02,655	5,37,300
హసన్‌పర్తి	26	29,45,300	6,38,000
నర్సంపేట	25	28,81,020	18,00,120
గీసుకొండ	24	19,66,000	2,86,875
పరకాల	23	28,69,970	1,62,0000
మడికొండ	22	12,24,000	8,65,000
పాలకుర్తి	21	4,71,500	27,500



ఈ నెల 20న కాశిబుగ్గలోని ఓ ఉల్లిగడ్డల షాపు ముందు పార్కింగ్ చేసి ఉన్న ఓ బైకును ముగ్గురు దొంగలు అపహరించారు. అదే విధంగా 19వ తేదీన తెల్లవారుజామున కాశిబుగ్గలోని కూరపాటి పెంటయ్య కిరాణం షాపు షట్టర్ తాళం తీసేందుకు ఇద్దరు గుర్తు తెలియని దొంగలు ప్రయత్నించారు. ఈక్రమంలో కొంత అలికిడి రావడంతో దొంగలు అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ రెండు ఘటనలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

ఈనెలలో జరిగిన చోరీలు ఇలా..



ఈనెల 19న రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు కిటికీ అద్దం పగులగొట్టి, గ్రిల్స్‌ను తొలగించి దొంగలు లోపలికి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు ఉన్న బీరువాను కట్టర్‌తో కట్ చేసి 19.05 కిలోల బంగారు ఆభరణాలు రూ. 13.61 కోట్ల విలువైన ఆభరణాల్ని చోరీ చేశారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేసి పోలీసులకు ఎలాంటి క్లూ దొరక్కుండా చేసి వెళ్లారు.

- ఈనెల 12న హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి భావుపేట క్రాస్‌లోని ఎల్లాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు టార్గెట్ చేశారు. తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10 లక్షల నగదు రూ.1.80 లక్షల విలువైన బంగారు ఆభరణాల్ని ఎత్తుకెళ్లారు.
- కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 17న అస్సరీ కాలనీలోని ఓ ఇంట్లో జరిగిన చోరీలో గుర్తు తెలియని దొంగలు రూ.13.60 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీకి పాల్పడ్డారు.
- 21న మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి బొల్లికుంటలో పార్క్ చేసి ఉన్న జేసీబీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసుకుని ఎత్తుకెళ్లారు. దీని విలువ రూ.18 లక్షలు.
- ఈనెల 22న కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధి ప్రశాంత్‌నగర్‌లో గుర్తు తెలియని దొంగలు ఓ ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టారు. అందులో ఉన్న రూ.14.89 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు.

సృజనాత్మక ఆవిష్కరణలకు వేళాయె



హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

నేటి నుంచి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్

- ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన 120 మంది విద్యార్థులు
- 200 వరకు ఎగ్జిబిట్ల ప్రదర్శన
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరూ

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎగ్జిబిట్ల ప్రదర్శనలకు సమయం ఆసన్నమైంది. శుక్ర, శనివారం(ఈనెల 29, 30 తేదీల్లో) రెండు రోజులపాటు ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్‌ను హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలు (డీ.ఎల్.బీ.వీ.పీ)-24, ఇన్‌స్పైర్ అవార్డుల మూల్యాంకనం, ప్రాజెక్ట్ ప్రదర్శన-2023ను హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు ప్రదర్శనలకు సిద్ధమయ్యారు. ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన 120 మంది విద్యార్థులు వారు గత సంవత్సరం నామినేషన్ చేసుకున్న అంశాల్లో ఎలాంటి మార్పు లేకుండా ఎగ్జిబిట్లతో హాజరు కాబోతున్నారు. పోటీకి హాజరయ్యే విద్యార్థులకు ఈ ప్రదర్శనలో భాగంగా ఒకరోజు సెమినార్ సుస్థిర భవిష్యత్, ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు (మిల్లెట్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్) అనే అంశంపై ఒక రోజు సెమినార్ కూడా నిర్వహించనున్నారు.

7 థీమ్స్..

జిల్లాలో సైన్స్‌ఫేర్‌లో 200లవరకు ఎగ్జిబిట్లు రానున్నాయి. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు జూనియర్స్‌గానూ 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్లుగాను తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. ఒక ప్రధాన అంశంతోపాటు 7 సబ్ థీమ్స్‌లలో ఎగ్జిబిట్లను ప్రదర్శించబోతున్నారు. ఒక ఎగ్జిబిట్‌కు ఒక విద్యార్థినే అనుమతిస్తారు. ఒక్కో స్కూల్ నుంచి అన్ని సబ్ థీమ్స్ కలిపి ఆరు ఎగ్జిబిట్లకు అనుమతిస్తారు. శుక్రవారం ఎగ్జిబిట్లను తిలకించడం కోసం హనుమకొండ, కాజీపేట, ఐనవోలు, హసన్‌పర్తి, దామెర, ధర్మసాగర్, ఆత్మకూరు, నడికూడ మండలాల విద్యార్థులను తీసుకురావాలని డీఈఓ వాసంతి ప్రధానోపాధ్యాయులను కోరారు. అదేవిధంగా శనివారం భీమదేవరపల్లి, వేలేరు, పరకాల, ఎల్కతుర్తి, కమలాపూర్, శాయంపేట మండలాల నుంచి విద్యార్థులను తీసుకురావాలని ఆమె కోరారు. ఎగ్జిబిట్ల ప్రదర్శనకు గురువారం మధ్యాహ్నం నుంచే హనుమకొండలోని ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ హైస్కూల్‌కు జిల్లాలోని విద్యార్థులు ఎగ్జిబిట్లు, గైడ్ టీచర్లతో చేరుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా కొనసాగుతున్నట్లు.. డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి తెలిపారు. బాలల వైజ్ఞానిక ప్రదర్శనల కార్యక్రమంలో విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లు, వివిధ కమిటీల్లోని ఉపాధ్యాయులు కలిపి సుమారు 800ల మంది వరకు ఉండబోతున్నారు. వీరందరికీ సదుపాయాలు కల్పించారు

ఏర్పాట్లు పూర్తి..

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్‌కు సంబంధించి తేజస్వీ హైస్కూల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించేలా వివిధ కమిటీలు ఏర్పాటు చేశాం. ఈనెల 29న ఉదయం 10 గంటలకు ఈ ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్ ప్రారంభ కార్యక్రమం ఉంటుంది. ఇందులో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. – వాసంతి, డీఈఓ

నాణ్యమైన భోజనం అందించండి

- ఎంఈఓ రాంకిషన్‌రాజు
- పాఠశాలల్లో మిడ్ డే మీల్స్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

కమలాపూర్: 'మెనూ అమలెక్కడ?' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన దొడ్డు బియ్యం.. ముద్ద అన్నం కథనానికి ఎంఈఓ రాంకిషన్ రాజు స్పందించారు. కమలాపూర్ మండలంలోని పలు పాఠశాలలను ఆయన గురువారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. వంగపల్లి, పంగిడిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, లేకపోతే పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వంగపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాంకిషన్ రాజు

శుచి, రుచి ఉండాలి..

దామెర: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం శుచి, రుచికరంగా ఉండాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల, వెంకటాపూర్ పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, భోజన పదార్థాలు పరిశీలించారు. వంటగదితోపాటు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆర్‌ఐ సంపత్, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పెద్దపెండ్యాలలో కేంద్ర బృందం పర్యటన

ధర్మసాగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన కోసం మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వారికి అందుతున్న ప్రోత్సాహకాలు, దాని ద్వారా జరుగుతున్న లబ్ధి, మహిళా సంఘాల సభ్యులతో నిర్వహిస్తున్న కిరాణా షాపు ద్వారా వారికి అందుతున్న లబ్ధి గురించి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యుల ద్వారా పిల్లలకు అందిస్తున్న మెనూను తెలుసుకొని మహిళా గ్రూప్ సభ్యులకు ఇస్తున్న రెమ్యూనరేషన్ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ప్రాజెక్టర్ ద్వారా సైన్స్ పాఠాలు విన్నారు. అనంతరం కరుణాపురంలోని అతి పెద్ద చర్చిని సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు సుధీర్‌యాదవ్, బసంత్‌నాథ్ సైన్, అంకిత వర్షిని, రంజిత్ సింగ్, రమేశ్ దేశ్వాల్, సీమా అగర్వాల్, అనామిక గుప్తా, పంకజ్‌కుమార్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏపీఎం అనిత, ఎంపీఓ అఫ్జల్, ఏపీఓ సంపత్, వైద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మహిళా సమాఖ్య సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి డిజిటల్ క్లాస్‌లు వింటున్న కేంద్ర బృందం

రక్తహీనత నివారణకు బీవీపీ కృషి

రీజనల్ సెక్రటరీ వి.వి.నాగేందర్

దామెర: రక్తహీనత నివారణకు భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) కృషి చేస్తోందని ఆ సంస్థ సౌత్ రీజనల్ సెక్రటరీ వి.వి.నాగేందర్ తెలిపారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ కళాశాలలో బీవీపీ ఆధ్వర్యంలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా.. 176 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో 50 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కాగా.. వారికి ఐరన్, కాల్షియం, విటమిన్ డీ-3 మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేందర్ మాట్లాడుతూ.. భారత్ వికాస్ పరిషత్ నిర్వహించే సేవా కార్యక్రమాల్ని వినియోగించుకోవాలన్నారు. తెలంగాణలో 13,847 మందికి అనీమియా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సమావేశానికి ఓరుగల్లు శాఖ అధ్యక్షుడు డాక్టర్ డి.సుధీర్‌కుమార్ అధ్యక్షత వహించగా.. కళాశాల డైరెక్టర్ సీహెచ్.జయపాల్‌రెడ్డి, కార్యదర్శి కూతురు సత్యనారాయణ, ఎం.దామోదర్, పి.వివేకానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు త్వరగా చెల్లించేలా చర్యలు

కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే ఆన్‌లైన్ చేసి త్వరగా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి నగదు చెల్లింపులపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు తరలింపు, ఆన్‌లైన్ నమోదు, రైతుల చెల్లింపుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు కూడా వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, షేర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్య వివాహాల రహిత భారత్ ప్రచారంలో భాగంగా రూపొందించిన 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' పోస్టర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జయంతి, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఈఓ సింధూరాణి, చైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ భాస్కర్, షేర్ ఎన్‌జీఓ కౌన్సిలర్ జి.రాజేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సీసీఐలో అమ్ముకుంటే రైతులకు మేలు

పరకాల: రైతులు పండించిన పత్తిని సీసీఐ ద్వారా అమ్మితే గిట్టుబాటు ధర లభిస్తుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పరకాల శివారు కాటన్ మిల్లులో జరుతుతున్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరుగకుండా చూడాలని సీసీఐ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం పరకాల పట్టణంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట ఎంపీడీఓకు షోకాజ్ నోటీసులు

దామెర: సామాజిక, ఆర్థిక, విద్యా సమగ్ర కులగణన సర్వే వివరాలు తప్పులు లేకుండా పక్కాగా ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మండలంలోని ఊరుగొండ సమీపంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న దామెర, ఆత్మకూరు, శాయంపేట మండలాల సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాయంపేట మండల వివరాలను ఎన్యుమరేటర్లు లేకుండా నమోదు చేస్తున్నారని.. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్యుమరేటర్లు ఎక్కడ అని ప్రశ్నించగా.. అక్కడే ఉన్న ఎంపీడీఓ ఫణిచంద్ర ఏమీ మాట్లాడకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు లేకుండా వివరాలు డేటా నమోదు చేయొద్దని, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆమె వెంట ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, ఫణిచంద్ర ఎంపీఓలు ఎంవీ. రంగాచారి, విమల, ఎంపీఎస్‌లో భారతి, ఏపీఓ ఝాన్సీ, లలిత తదితరులున్నారు.



సర్వే నమోదు ప్రక్రియ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

నేటి నుంచి కేయూ డిగ్రీ పరీక్షలు

- మొదటి, మూడో, ఐదో సెమిస్టర్లు..
- హాజరుకానున్న 1,77,274 మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి గురువారం తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 70,610 మంది, మూడో సెమిస్టర్ పరీక్షలకు 59,872 మంది, ఐదో సెమిస్టర్ పరీక్షలకు 46,792 మంది విద్యార్థులు మొత్తం 1,77,274 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 46, ఖమ్మం జిల్లాలో 29, ఆదిలాబాద్ జిల్లాలో 46 మొత్తం 121 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.మొదటి సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా ఆయా కళాశాలలు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేస్తున్నాయి.

'ఓపెన్'లో ప్రవేశాలకు అవకాశం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ఈవిద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు చివరి అవకాశం కల్పించారు.డిసెంబర్ 2నుంచి 11తేదీ వరకు ఆసక్తి ఉన్న వారు ప్రవేశాలు పొందాలని హనుమకొండ డీఈఓ వాసంతి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోనూ సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే అడ్మిషన్లు పొందాల్సింటుందన్నారు. అభ్యర్థులు స్వయంగా అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ద్వారా చెల్లించి అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫామ్ ప్రింట్‌అవుట్ తోపాటు వెంటనే సమర్పించాల్సింటుందన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం సెల్ నంబర్ (9346020003),(9396337572)లో సంప్రదించొచ్చు.

కాంటా.. కళకళ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగిన పత్తి కొనుగోళ్లు

- ఈ నెల26వ తేదీ నాటికి 12,71,831 క్వింటాళ్లు..
- గతేడాదితో పోల్చితే రెండింతల కంటే ఎక్కువ పెరిగిన కొనుగోళ్లు
- తేమ శాతం తగ్గడంతోనే..

వరంగల్ : కాంటా కాటన్ తూకంతో కళకళలాడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 19 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని ప్రైవేట్ వ్యాపారులతో పాటు 58 సీసీఐ కొనుగోలు కేంద్రా(జిన్నింగ్ మిల్లు)ల్లో ఈనెల 26వ తేదీ నాటికి 12,71,931 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వరంగల్ ఆర్‌జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. తేమ శాతం తగ్గడంతో పత్తి కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు. గత ఏడాది కంటే ఈఏడాది ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి 5,17,572 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరగగా ఈఏడాది 12,71,831 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయన్నారు.


విక్రయించేందుకు వచ్చిన పత్తి వాహనాలు

జిల్లా	జిన్నింగ్ మిల్లులు	ప్రైవేట్(క్వి)	సీసీఐ(క్వి)	మొత్తం
వరంగల్	26	1,86,043	3,65,479	5,51,522
హనుమకొండ	4	28,652	22,169	50,821
జనగామ	15	1,09,044	3,07,217	4,16,261
మహబూబాబాద్	6	23,169	1,04,955	1,28,124
ములుగు	3	13,198	38,534	51,732
భూపాలపల్లి	4	8,611	64,760	73,371
మొత్తం	58	3,68,717	9,03,114	12,71,831

ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి

- ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం
- కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి
- కేయూలో జాతీయ సదస్సు


జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోందని, ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూలో సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబలైజేషన్‌డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ప్రాసెస్‌ఇన్ కాంటెంపరరీ ఇన్ ఇండియా' అనేఅంశంపై రెండు రోజులు జరిగే జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశంలో వృద్ధ జనాభాపై ప్రభావం రేపటి సమస్య అన్నారు. ప్రపంచీకరణ మానవ సమాజంపై అత్యంత ప్రభావం చూపిందన్నారు. సోషియాలజీలో ఆ దిశగా పరిశోధకులు పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రత్యేక అతిథి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీ మరోరెండేళ్లలో ఎంతో అభివృది చెందబోతుందన్నారు. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. త్వరలోనే యూనివర్సిటీ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించబోతున్నారన్నారు. వృద్ధులు, పిల్లలకు సంబంధించిన అంశాలపై కూడా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం మాజీ డీన్, రిటైర్డ్ ఆచార్యుడు కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ కేవలం ఆర్థిక వ్యవస్థమీదే కాదని అన్నిరంగాలపై కూడా అత్యంత ప్రభావం చూపిందన్నారు. వలసవాదులతో గ్రామీణ భారతం విచ్ఛిన్నం అయిందన్నారు. సెమినార్ డైరెక్టర్, సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్, సోషల్‌సైన్స్‌డీన్ టి. మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, కేయూ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు కూరపాటి వెంకటనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు హనుమంతురావు, గణేశ్, అడప సత్యనారాయణ, ఎస్‌వీ యూనివర్సిటీ ఆచార్యుడు డి. వెంకటేశ్వర్లు , కేయూ రిటైర్డ్ ఆచార్యులు రాములు, సోషియాలజీ విభాగం ప్రొఫెసర్లు స్వర్ణలత, కుంట అయిలయ్య మాట్లాడారు. తొలుత ఈజాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. రేపటితో ఈసదస్సు ముగియనున్నది.

బ్రీత్ అనలైజర్ మార్చాలి..

- ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ధర్నా
- నిలిచిన బస్సులు..
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు


ధర్నా చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

నెహ్రూసెంటర్: బ్రీత్ అనలైజర్ మార్చాలని, తొలగించిన అద్దె బస్సు డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ అద్దె బస్సు యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డిపో ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం డ్రైవర్లతో పాటు అయ్యప్ప మాలధారణ చేసిన డ్రైవర్ శ్రీనివాస్‌ను బ్రీత్‌అనలైజర్‌తో పరీక్ష చేయగా 5 శాతం ఆల్కాహాల్ తీసుకున్నట్లు కనిపించింది. కొంత సేపు ఆపిన అనంతరం విధులకు అనుమతించారు. దీంతో గురువారం యూనియన్ ఆధ్వర్యంలో అద్దె బస్సులను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. బ్రీత్ అనలైజర్ సక్రమంగా పని చేయకపోవడంతో గతంలో కూడా కొంత మందిని విధుల నుంచి తొలగించారని, మాలధారణ చేసిన డ్రైవర్‌కు కూడా అదే విధంగా రావడంపై డ్రైవర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రీత్ అనలైజర్‌ను మార్చాలని, విధుల నుంచి తొలగించి డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై డిపో మేనేజర్‌తో చర్చించగా డ్రైవర్ల సమస్యల పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వగా బస్సులను ఉదయం 10.45 గంటలకు యథావిధిగా నడిపించారు. కాగా, అద్దె బస్సుల డ్రైవర్లు ధర్నాతో 14 బస్సులు గురువారం తెల్లవారు జామునుంచి డిపోనకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

అయ్యప్ప మాలధారుల ఆందోళన

తొర్రూరు: అయ్యప్ప మాలలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయడం దుమారం రేపింది. తాజాగా డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అయ్యప్ప మాలలో ఉన్న డ్రైవర్ నాగరాజుకు బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించారు. కాగా, తమ మనోభావాలు దెబ్బతీశారని ఆరోపిస్తూ గురువారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట అయ్యప్పమాలధారులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ డీఎం పద్మావతి, ఎస్సై ఉపేందర్ అయ్యప్ప మాలధారులను శాంతిపజేయడానికి యత్నించారు. రోజువారీగా నిర్వహించే విధుల్లో భాగంగానే బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించడం జరిగిందని, మాలలో ఉన్న డ్రైవర్‌ను కించపర్చాలనే ఉద్దేశం తమకు లేదని డీఎం తెలిపారు. ఘటనపై బీజేపీ నాయకులు ఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు. డీఎంను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారమే..

ఆర్టీసీ నిబంధనల ప్రకారం రోజూ విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తాం. అందులో భాగంగా మాలధారణ చేసిన డ్రైవర్‌ను కూడా పరీక్షించాం. దీంతో అద్దె బస్సు డ్రైవర్లు బస్సులు నిలిపి సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. దీనిని ఉన్నతాధికారులకు వివరించాం. బ్రీత్ అనలైజర్ గురించి వివరించగా మిషన్ మార్చడంతో పాటు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– శివప్రసాద్, డిపో మేనేజర్,మహబూబాబాద్

ఏసీబీ వలలో పీఆర్ ఏఈ

- ఫైనల్ బిల్లు కోసం రూ.5 వేలు డిమాండ్
- డబ్బు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


ఏసీబీకి చిక్కిన ఏఈ కార్తీక్

వరంగల్: వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోని డ్రాయింగ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ గాదె కార్తీక్.. ఏసీబీ వలలో చిక్కుకున్నారు. రూ. 5 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామంలో ఎంజీఎస్ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరైన మూడు సీసీ రోడ్ల ఫైనల్ బిల్లు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌ను లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్ హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వద్ద ఏఈ కార్తీక్‌కు రూ.5వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడు ఏఈ గాదె కార్తీక్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు వారు తెలిపారు.

తెలియక విషగుళికలు తిన్న చిన్నారులు

- అపస్మారకస్థితికి చేరిక.. ఆస్పత్రికి తరలింపు


అపస్మారక స్థితికి చేరుకున్న చిన్నారులను ఎత్తుకున్న తల్లిదండ్రులు

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు చిన్నారులు తెలియక విష గుళికలు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. మండల కేంద్రంలోని పెరిక బజారుకు చెందిన జ్ఞానేశ్వర్, జాహ్నవి కవలలు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉన్న విష గుళికలు తెలియకుండా తిన్నారు. అనంతరం అపస్మరక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స నిర్వహించకుండానే వైద్యులు ఏటూరునాగారం వైద్యశాలకు రెఫర్ చేశారు. కాగా, వెంకటాపురం మండలానికి చెందిన 108 వాహనం మరమ్మతుకు గురైంది. దీంతో వాజేడు మండల 108 వాహనానికి సమాచారం అందించి గంటకు పైగా ఎదురుచూసినా రాకపోవడంతో గ్రామస్తులు ప్రైవేట్ వాహనంలో చిన్నారులను ఏటూరు నాగారం వైద్యశాలకు తరలించారు.

కాటారంలో భారీ చోరీ

- 18 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణ


ధ్వంసమైన బీరువా

కాటారం : కాటారం మండలం శంకరాంపల్లి జీపీ పరిధిలోని బుడగజంగాల కాలనీలో భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి పెద్ద ఎత్తున సొత్తు అపహరించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనుముల సత్తమ్మ ఒంటరిగా నివసిస్తోంది. తన కూతురు ప్రసవం నిమిత్తం నాలుగు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి సమయంలో తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండడం గమనించిన చుట్టు పక్కల వారు సత్తమ్మ, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సత్తమ్మ ఇంటికి వచ్చి చూడగా దొంగలు బీరువా తాళం తెరిచి అందులోని 18 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు, టీవీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. సీఐ నాగార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా, క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. అనంతరం బాధితురాలు సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య నిందితులు!

- వివాహేతర సంబంధమే కారణమా?

కాళేశ్వరం : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో జరిగిన హత్య నిందితులను మహదేవపూర్, కాళేశ్వరం పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా కొమ్మెర గ్రామానికి చెందిన మృతుడు ముత్యాల శ్రీకాంత్‌గౌడ్(23)ను బుధవారం నడిరోడ్డుపై పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో దారుణంగా హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనతో రెండు జిల్లాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. హత్యకు పాల్పడిన అనుమానితులు పెద్దపల్లి జిల్లా మంథని మండలం చందనాపూర్‌కు చెందిన ఇద్దరు, సహకరించిన మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కూర్‌కు చెందిన మరో వ్యక్తితో కలిసి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు మృతుడు, నిందితుల కాల్‌డాటా ఆధారంగా పూర్తి సమాచారం సేకరించినట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు, ఎవరెవరు సహకరించారో విచారణను వేగవంతం చేస్తున్నారు. ఈహత్యకు గల కారణం ప్రధానంగా డబ్బులు అప్పుగా ఇవ్వడంతో పాటు మహిళతో వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహిళ అకౌంట్‌నుంచి డబ్బులు మాయం

డోర్నకల్: సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఓ మహిళ తన ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకుంది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. స్థానిక టంకుతండాకు చెందిన భూక్యా హరిత సెల్‌ఫోన్‌కు ఈ నెల 15న జాబ్ ఇప్పిస్తామంటూ ఓ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తాను జాబ్ చేస్తానంటూ తిరిగి మెసేజ్ పెట్టగా బ్యాంకు అకౌంట్ వివరాలు పంపాలని సైబర్ నేరగాళ్లు కోరడంతో పంపింది. దీనికి ప్రతిగా సైబర్ నేరగాళ్లు రూ.250 హరిత అకౌంట్‌కు పంపించారు. అప్పటికే హరిత బ్యాంకు అకౌంట్‌లో రూ.1,01,000 ఉండగా 16వ తేదీన మూడు సార్లు అకౌంట్ నుంచి వివిధ అకౌంట్లకు రూ.86,501 నగదు బదిలీ అయింది. 17న హరిత అకౌంట్ బ్యాలెన్స్ చెక్ చేసుకోగా తనకు తెలియకుండా గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాలకు నగదు బదిలీ అయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోర్టల్‌కు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సైబర్ క్రైం సిబ్బంది హరిత అకౌంట్ నుంచి నగదు బదిలీ అయిన ఖాతాలను పరిశీలించి బదిలీ ప్రాసెస్‌లో ఉన్న రూ.50వేల నగదును హోల్డ్‌లో ఉంచారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బండి.. భద్రత ముఖ్యం

ఏమరుపాటుతోనే రోడ్డు ప్రమాదాలు

- బ్రేక్ ఫెయిలైతే.. వాహనం నుంచి సంకేతాలు
- గుర్తించి సరిచేయిస్తే సురక్షిత ప్రయాణం



నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘటనల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కేవలం చిన్న నిర్లక్ష్యం కారణంగా చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వాహనం నడిపే ముందు కండీషన్ చూసుకుంటే ఇలాంటి ప్రమాదాల నుంచి బయట పడొచ్చని మెకానిక్‌లు చెబుతున్నారు. దీనికితోడు వాహనం నడిపే సమయంలో కొన్ని రకాల సంకేతాలు వస్తుంటాయని, వాటిని గుర్తిస్తే ప్రయాణం సురక్షితంగా సాగించొచ్చని పేర్కొంటున్నారు.

కాజీపేట: రోజూ టీవీలు, పత్రికల్లో రోడ్డు ప్రమాదంలో ఇంతమంది చనిపోయారు.. ఇంత మందికి గాయాలయ్యాయి అంటూ వచ్చే కథనాలు చూస్తుంటాం. అయితే ఈ ప్రమాదాలు ఎలా సంభవించాయి? దీనికి గల కారణాలు ఏమిటి? అనే అంశంపై ఎవరూ పెద్దగా దృష్టిసారించరు. ఇలాంటి ప్రమాదాలు బ్రేక్‌లు ఫెయిల్ అవడం వల్లే ఎక్కువ జరుగుతున్నట్లు తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తారు. ఇలా చిన్న పొరపాట్లతో విలువైన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించేస్తుంటారు. రోజూ వాహనంపై ప్రయాణించే ముందు చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారి నుంచి బయటపడొచ్చు. ప్రధానంగా లారీలు, జీపులు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల బ్రేక్ కండీషన్లు ప్రత్యేకంగా చూసుకోవాలి. వాహనం అతివేగంతో నడిపే సమయంలో ఒకసారిగా నిలపాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు బ్రేక్‌లు కండీషన్‌లో ఉండాలి. ఈ విషయం చాలా మంది పెద్దగా పట్టించుకోరు. వాహనంలో ఇంధనం ఉందో లేదో.. వాహనం లైట్లు వెలుగుతున్నాయో లేదో.. అనే విషయంపైనే దృష్టి సారిస్తారు తప్ప..బ్రేక్‌లు, వాటి కండీషన్‌ను గమనించే ప్రయత్నం చేయరు. ఈ చిన్న నిర్లక్ష్యం వల్లే అధికంగా బ్రేక్ ఫెయిల్ అయి ప్రమాదాలు సంభవిస్తున్నట్లు మెకానిక్‌లు చెబుతున్నారు. అయితే చాలా మందికి ఈ బ్రేక్ ఫెయిల్ ప్రమాదానికి ముందే తమ వాహనాలు హెచ్చరికలు చేస్తాయట. ఈ వాహనాల నుంచి వచ్చే ఐదు సంకేతాలు క్షుణ్ణంగా వింటే బ్రేక్ ఫెయిల్ అనే సమస్యే రాదని మెకానిక్‌లు చెబుతున్నారు. అవింటో తెలుసుకుందాం..

రాసుకుంటున్న శబ్దం..

వాహనంలో ప్రయాణించే సమయంలో రాసుకున్న, గీసుకున్న శబ్దాలు వస్తే వాహనం బ్రేక్‌లు ఫెయిల్ అవడానికి సిద్ధంగా ఉందని అర్థం. చాలా కంపెనీలు ప్రయాణికుల భద్రత కోసం ఆయా వాహనాల్లో ఇలాంటి శబ్దం వచ్చేలా మెకానిజం ఏర్పాటు చేస్తాయి. బ్రేక్‌లను చివరి వరకు ప్రెస్ చేసినా వాహనం ఆగడం లేదంటే వెంటనే బ్రేక్ షూ మార్చుకోవాలని అర్థం.

గరగరమనే శబ్దం..

వాహనం బ్రేక్ వేసే సమయంలో చక్రాలను నియంత్రించే బ్రేక్ షూ డ్రమ్‌ను గట్టిగా పట్టి ఉంచుతుంది. ఈ రెండింటి మధ్య బ్రేక్ లైనింగ్ ఉంటుంది. వీటిని ఎక్కువ కాలం మార్చకుండా ఉంటే బ్రేక్ షూ అరిగిపోయి డ్రమ్ రాపిడికి గురవుతుంది. ఈ సమయాల్లో ఇలాంటి శబ్దం వస్తే మెకానిక్‌లను సంప్రదించి సరి చేయించుకోవాలి. లేని పక్షంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

కుదుపులు రావడం ద్వారా..

బ్రేక్‌లు ఫెయిల్ అయితే రెండు రకాల వైబ్రేషన్స్ వస్తుంటాయి. మొదటిది వాహనం నడిపే సమయంలో బ్రేక్ వేస్తే పాదం కింద ఉండే పెడల్ వైబ్రేట్ అవుతుంది. ఈ సంకేతం ద్వారా బ్రేక్‌లో తేడా ఉన్నట్లు గుర్తించాలి. రెండు బ్రేక్‌లు వేసినప్పుడు వెహికల్ మొత్తం వైబ్రేషన్ రావడం ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. ఈ సంకేతం అందిందంటే బ్రేక్‌లో పెద్ద సమస్య ఉన్నట్లు భావించి వెంటనే సరి చేయించుకోవాలి. అంతేకాక బ్రేక్ పెడల్‌మీద, కాలు మొత్తం వైబ్రేషన్ వస్తుందంటే బ్రేక్‌లో అరుగుదల ఎక్కువ ఉందని గమనించాలి. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదానికి గురికాక తప్పదు.



బ్రేక్ పెడల్ లోతుగా తొక్కుతున్నారా..

బ్రేక్ పెడల్‌ను లోతుగా తొక్కుతూ వాహనం కంట్రోల్ చేస్తున్నారా? అయితే వాహనం బ్రేక్‌లు వెంటనే సరి చేయించుకోవాలి. బ్రేక్ షూ అరిగితే వెంటనే మార్చడం మంచిది. బ్రేక్‌ల్లో ఫ్లూయిడ్ తక్కువైతే ఇలా జరుగుతుంది. అందుకే వాహనాన్ని వెంటనే మెకానిక్ వద్ద బాగు చేయించుకోవాలి. ఎందుకంటే బ్రేక్ ఫ్లూయిడ్ లేని వాహనం నడపడమంటే ప్రాణాలతో చెలగాటం ఆడడమే అని గుర్తించుకోవాలి.

వెంటనే సరిచేసుకోవాలి



వాహనంలో బ్రేక్ సమస్యలు ఏర్పడితే అశ్రద్ధ చేస్తారు. కొందరైతే అడ్జస్ట్‌మెంట్ చేయించుకుని వెళ్తారు. ఇది సరికాదు. వాహనానికి బ్రేక్‌లు చాలా ప్రధానం. వీటిలో ఎలాంటి లోపం ఉన్నా వెంటనే సరిచేయించుకోవాలి. అలాగే నెలకు ఒకసారైనా వాహనాన్ని ఇంజన్ సైడ్ సర్వీసింగ్ చేయించుకోవడం మంచిది. దీనివల్ల వాహనంలో ఉండే లోపాలను సరిచేసుకునే వీలుంటుంది. తద్వారా ప్రయాణం సాఫీగా జరుగుతుంది. వాహనం నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి.

–తోట యాదగిరి, మెకానిక్, (మడికొండ)

బ్రేక్ వార్నింగ్ లైట్..

ఇటీవల మార్కెట్‌లోకి వస్తున్న వాహనాలకు ఆయా కంపెనీలు వాహన డ్యాష్ బోర్డులో బ్రేక్ వార్నింగ్ లైట్‌ను అమర్చుతున్నాయి. దీనిలో ఒకవైపు యాంటీ బ్రేక్ లాకింగ్ సిస్టం.. మరోవైపు బ్రేక్ సిస్టం వార్నింగ్ లైట్లు ఉంటాయి. వాహనం రన్నింగ్‌లో ఉన్నప్పుడు బ్రేక్ అప్లయ్ చేస్తే ఏబీఎస్ సిస్టం యాక్టీవెట్ అయ్యి దీనికి అనుసంధానం చేసిన లైట్ వెలుగుతుంది. బ్రేకింగ్, ఏబీఎస్ వ్యవస్థల పనితీరులో ఏ మాత్రం లోపం ఉన్నా బ్రేక్ వార్నింగ్ లైట్లు వెలిగి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి. బ్రేక్‌లు ఫెయిల్ అవుతున్నాయనే సందేశాన్ని ఇచ్చిన వెంటనే మెకానిక్ వద్దకు తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.